

## అరాచకాలు, అక్రమ కేసులతో

# బీఆర్ఎస్‌ను అడ్డుకోలేరు

**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్**

అధికారం ఉందనీ, అరాచకాలు, దౌర్జన్యాలతో కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌ను అడ్డుకోలేరని బీఆర్ఎస్ నేతలు ఎమ్మెల్సీ తాతా మధు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాల ఉపేందర్‌రెడ్డి, బానోత్ చంద్రావతి, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు విమర్శించారు. రోజురోజుకూ కాంగ్రెస్ నేతల అరాచకాలు మితిమీరిపోయాయని, ప్రధాన ప్రతిపక్షానికి చెందిన వారిపై అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురి చేస్తున్నారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రతో పాటు ముఖ్యనాయకులు మండిపడ్డారు. అధికార పార్టీ నాయకుల ప్రోద్బలంతో పోలీసులు వేధింపులకు గురి చేయడంతో బానోత్ రవి ఆత్మహత్యకు యత్నించడం జరిగిందన్నారు. ఎంపీ రవిచంద్ర బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య,కందాళ ఉపేందర్ రెడ్డి, బానోత్ చంద్రావతి, జెడ్పీ మాజీ ఛైర్మన్ లింగాల కమల్ రాజ్ తదితర నాయకులతో కలిసి ఖమ్మం తెలంగాణ భవన్ లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఈ జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు అభివృద్ధిపై దృష్టి సారించకుండా ప్రధాన పక్షానికి చెందిన నాయకులను రాజకీయంగా అణచివేయాలని ప్రయత్నిస్తున్నారని ఎంపీ రవిచంద్ర ఆవేదన చెందారు. ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే, వార్తలు రాసే వారిపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బంది పెట్టడం రాష్ట్రమంతటా కూడా నిత్యకృత్యంగా మారిందని ఎంపీ రవిచంద్ర ఆందోళన వ్యక్తం చేశారు. అధికార పార్టీ నాయకుల దురాగతాలను వ్యతిరేకిస్తూ ప్రత్యక్ష కార్యాచరణకు దిగాలని బీఆర్ఎస్ శ్రేణుల నుంచి వత్తిళ్లు ఉన్నా కూడా శాంతియుత పరిస్థితులకు భంగం కలుగొద్దనే ఉద్దేశంతో ఆగిపోయామని ఎంపీ రవిచంద్ర చెప్పారు. బీఆర్ఎస్ నాయకుడు రవిని వేధిస్తున్న వారిపై పోలీసులు ఇప్పటి దాక కేసు నమోదు చేయకపోవడం బాధాకరమన్నారు.అధికార పార్టీకి చెందిన నాయకులు పోలీసులను ప్రయోగించి బీఆర్ఎస్ వారిపై ఎన్ని అణచివేత చర్యలకు పాల్పడినా కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీ విజయఢంకా మోగించడం తథ్యమని ఎంపీ వద్దిరాజు స్పష్టం చేశారు. సమావేశం అనంతరం రవిచంద్ర, తాతా మధు, వెంకటవీరయ్య, ఉపేందర్ రెడ్డి, చంద్రావతి, కమల్ రాజ్, ఉప్పల వెంకట రమణ, ఖమర్, బెల్లం వేణు తదితర నాయకులు నగర పోలీసు కమిషనర్ సునీల్ దత్ ను కలిసి రవిని వేధింపులకు గురి చేస్తున్న వారిపై కేసు నమోదు చేసి, చట్ట ప్రకారం శిక్షించాలంటూ వినతిపత్రం అందజేశారు.



## ఇనుగుర్తి మండల అభివృద్ధిలో ముందుంటా:

# ఎంపీ రవిచంద్ర




**ఇనుగుర్తి, కెరటం న్యూస్ ప్రతినిధి**

ఉన్నఊరు కన్నతల్లి అనే నానుడిని నిజం చేస్తూ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తన స్వగ్రామం కోసం అహర్నిశలు కృషిచేస్తున్నారని ఇనుగుర్తి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్వతహాగా సేవాభావం కలిగిన వ్యక్తిగా కీర్తి కలిగిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తన పేరుకు తగ్గట్టుగానే రాజులా తన స్వగ్రామ అభివృద్ధికి విశేషంగా కృషిచేస్తున్నారు. ముఖ్యంగా గ్రామాన్ని మండల కేంద్రంగా చేయడంలో నాటి సీఎం కేసీఆర్‌తో మాట్లాడి మెప్పించి అనేక ఏండ్లుగా ప్రజల డిమాండ్‌ను నెరవేర్చి తన గ్రామం పట్ల ఉన్న చిత్త శుద్ధిని చాటుకున్నారని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తన ఎంపీ ల్యాడ్ నిధులను కేంటాయించడమే కాక అనేక మంది గ్రామ అభివృద్ధిలో భాగమయ్యేలా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఒక సమగ్ర విధానంతో గ్రామాన్ని ముందువరుసలో నిలబెట్టేందుకు కృషిచేస్తున్నారని అన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... ఇనుగుర్తి మండల కేంద్రానికి పోలీస్ స్టేషన్‌ను మంజూరు చేస్తూ జీవో నం.116 ని విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం కేసముద్రం మరియు నెల్లికుదురు మండలాల నుండి మొత్తం 13 గ్రామాలను ఇనుగుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోకి మారుస్తూ ఉత్తర్వులు స్థానిక సంస్థల నేపథ్యంలో నూతన పోలీస్ స్టేషన్ మంజూరు పట్ల ఇనుగుర్తి మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తన స్వస్థలం ఇనుగుర్తి గ్రామాన్ని మండలంగా సాధించడంలో గత ప్రభుత్వంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్‌ని ఒప్పించి మెప్పించి ఇనుగుర్తి మండలాన్ని సాధించడంలో తన వంతు కృషి చేసిన బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర. మండలం ఏర్పడిన తొలినాళ్లలోనే కావలసిన రావలసిన అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయవలసిందిగా కోరుతూ సంబంధిత శాఖలకు లేఖలు రాసిన ఎంపీ. రవిచంద్ర. ఇప్పటికే ఇంటిగ్రేటెడ్ స్కూలు నిర్మాణానికి మరియు పలు గ్రామాలకు రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు,కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలకీ తన ఎంపీ నిధులు కేటాయిస్తూ మండల అభివృద్ధిలో ఎంపీ రవిచంద్ర ముందు వరుసలో ఉన్నారు.

## దుర్గమ్మ సన్నిధిలో

**ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం**

# ఎంపీ కుటుంబం





**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్**

బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తన ధర్మపత్ని విజయలక్ష్మీ, కూతురు డాక్టర్ గంగుల గంగాభవాని, మనవళ్లు సనవ్, సౌరవ్ తదితరులతో కలిసి విజయవాడ కనకదుర్గమ్మ ఆలయాన్ని సందర్శించారు. దసరా శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా ఎంపీ రవిచంద్ర కుటుంబ సభ్యులతో కలిసి శనివారం రాత్రి విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర-విజయలక్ష్మీ దంపతులు, వారి కూతురు గంగాభవాని, మనవళ్లు సనవ్, సౌరవ్ తదితరులకు ఆలయ కమిటీ ఛైర్మన్, ప్రధాన అర్చకులు సాదర స్వాగతం పలికారు. వారు గర్భాలయాన్ని దర్శించుకుని తమ గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు ఎంపీ రవిచంద్రను కండువాతో సత్కరించి, ఆయనతో పాటు కుటుంబ సభ్యులకు ఆశీర్వచనాలు పలికారు, శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల తీర్థ ప్రసాదాలు అందించారు. ఎంపీ రవిచంద్ర కొత్తగా నియమితులైన ఆలయ కమిటీ ఛైర్మన్ ను శాలువాతో సత్కరించారు. ఎంపీ వద్దిరాజుతో పాటు బీఆర్ఎస్ నాయకులు జెన్నాయికోడే జగన్మోహన్, జెన్నాయికోడే చంద్రశేఖర్ తదితరులు కనకదుర్గమ్మను దర్శించుకున్నారు, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.